సాక్షి అనకాపల్లి

శనివారం । 13 । జూలై । 2024



శ్రీవారికి పట్టు వస్త్రాలు

విశాఖ: రుషికొండలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజల కోసం పట్టు వస్త్రాలు సమర్పించారు.



సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన


విశాఖ: సివిల్స్‌లో 833వ ర్యాంకు సాధించిన ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థి కొయ్యే చిట్టి రాజును సన్మానించారు.

గరిష్టం/కనిష్టం
32.5/26.5

వాతావరణం

తేలికపాటి నుంచి మోస్తరు వర్షం ఒకటి రెండు చోట్లపడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

ఇంకా ఎన్నాళ్లీ.. ఆర్థిక అబద్ధాలు



క్యాలెండర్లు మారుతున్నాయి.. దశాబ్దాలు గడుస్తున్నాయి.. కానీ మాట మాత్రం మారడం లేదు. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు నాయుడు చర్విత చరణంగా ఒకే అబద్ధాన్ని వల్లె వేస్తూ విశాఖ ప్రజలను మొత్తంగా ఉత్తరాంధ్రను మోసం చేస్తూ వస్తున్నారు. విశాఖలో ఏ సదస్సు జరిగినా.. చంద్రబాబు నోటి వెంట వచ్చే మొదటి మాట.. ''వైజాగ్‌ని ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాను. ప్రపంచపటంలో నిలబెడతాను''. 30 ఏళ్లుగా నగరాన్ని ఆర్థిక రాజధానిగా మార్చేందుకే ప్రయత్నిస్తున్నారా సీఎం సార్ అంటూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

1997 హైదరాబాద్ రాజధానే అయినా.. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తా..

1999 విశాఖపట్నం బ్యూటిఫుల్ సిటీ.. ఈ నగరాన్ని రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో పెడతా..

2014 వన్ సైడ్ సీ.. త్రీసైడ్స్ హిల్స్.. వైజాగ్ మోస్ట్ బ్యూటిఫుల్ సిటీ. ఆర్థిక రాజధానిగా, నాలెడ్జ్‌హబ్‌గా చేసి అంతర్జాతీయ సంస్థలను ఇక్కడికి తీసుకొస్తా..

2024 అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేసి.. విశాఖను ఆర్థిక రాజధానిగా, ఫిన్‌టెక్ హబ్‌గా మార్చేస్తా..

- **విశాఖపై అవ్యాజ ప్రేమ కురిపిస్తున్న చంద్రబాబు**
- **సీఎంగా ఉన్న ప్రతిసారీ విశాఖను ఆర్థిక రాజధాని చేస్తానంటూ ప్రగల్భాలు**
- 1995 నుంచి ప్రతిసారీ అదే పాట..
- వైజాగ్‌ను కించిత్తు అభివృద్ధి కూడా చెయ్యని టీడీపీ సర్కారు
- మరోసారి విశాఖను ఫిన్‌టెక్ హబ్‌గా, ఆర్థిక రాజధానిగా చేస్తానంటూ గొప్పలు
- ఇకపై జాతీయ, అంతర్జాతీయ సదస్సులు అమరావతిలోనే..
- విశాఖ బ్రాండ్‌ను క్రమంగా తగ్గించేందుకు టీడీపీ సన్నాహాలు
- వైఎస్ జగన్ హయాంలో నిర్వహించిన సదస్సులతో అంతర్జాతీయ ఖ్యాతి

సాక్షి, విశాఖపట్నం : ఆర్థికాభివృద్ధి అంటే.. భారీ భవంతులు నిర్మించడం మాత్రమే కాదు.. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడం.. ప్రతిప్రాంతంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం.. సగటు వ్యక్తి చెంతకు పరిపాలన వ్యవస్థను తీసుకురావడం.. ఆహ్లాదాన్ని పంచి.. ఉపాధి అవకాశాలు కల్పించి.. ప్రతి ఒక్కరూ సామాజికంగా.. ఆర్థికంగా ఎదగడం. కానీ 1995 నుంచి వివిధ దఫాలుగా సీఎంగా బాధ్యతలు నిర్వర్తించిన చంద్రబాబు.. ఏ సంవత్సరం కూడా.. తాను చెప్పిన ఆర్థిక రాజధాని అబద్ధాన్ని నిజం చెయ్యాలన్న ఆలోచన మాత్రం ఏ కోశానా చెయ్యలేదు. కేవలం మాటలతోనే కోటలు కట్టేస్తున్నారే తప్ప.. వైజాగ్ అభివృద్ధి కోసం ఏనాడూ పాటుపడలేదు.

ఆర్థికంగా ఎప్పుడు అభివృద్ధి చేశారు?

ఎప్పుడూ ఆర్థిక రాజధానిగా చేస్తానని చెప్పడమే తప్ప..విశాఖపై చంద్రబాబు చూపించేది కేవలం కపట ప్రేమేనని ఆయన చూపించిన వివక్షే స్పష్టం చేస్తోంది. ఐటీ రంగాన్ని అభివృద్ధి చేస్తానని ప్రకటించిన చంద్రబాబు.. తొలుత హైదరాబాద్ పైనే దృష్టిసారించారు. కానీ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి రుషికొండలో ఐటీసెజ్‌కు బాటలు వేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆయన మరణం తర్వాత ఐటీ కంపెనీలకు అందించే ప్రోత్సాహకాలపై తర్వాత ప్రభుత్వాలు క్రమేపీ శీతకన్ను వెయ్యడంతో చంద్రబాబు, లోకేష్ హయాంలో ఒక్కొక్కటిగా నిర్వీర్యమైపోయాయి. 1999లో రూ.284 కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు టర్నోవర్ 2009 నాటికి రూ.32, 509 కోట్లకు పెరిగింది. 2010-11లో ఐటీ ఉత్పత్తుల విలువ రూ.3600 కోట్లకు దిగజారిపోయింది. దిగ్గజ కంపెనీలు కూడా రాలేదు. మరి ఆర్థిక రాజధానిగా విశాఖను ఏం అభివృద్ధి చేసినట్లని ఐటీ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.



విశాఖను విస్మరించారిలా...

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా వేల కోట్ల రూపాయల భూ కుంభకోణంతో టీడీపీ ప్రభుత్వం విశాఖ పరువు తీసింది. టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు సాగరతీరాన్ని, భీమిలి, మధురవాడ ప్రాంతాలను చెరబట్టారు. తమ పార్టీ నేతలే రూ.వేల కోట్ల భూములు దోచుకున్నారంటూ అప్పటి మంత్రి, ప్రస్తుత స్పీకర్ అయ్యన్నపాత్రుడే సిట్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో విశాఖలో స్థలం కొనాలంటే భయపడే స్థాయికి తీసుకొచ్చారు.

- మెట్రో రైలు ప్రాజెక్టును తీసుకొస్తామని చెప్పిన చంద్రబాబు.. కేంద్రానికి డీపీఆర్ ఇచ్చేశామంటూ అబద్ధాన్ని ప్రచారం చేశారు. కానీ.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మెట్రో డీపీఆర్‌ని కేంద్రానికి పంపించింది.
- విశాఖను ఆర్థికరాజధానిగా చెయ్యాలని నిజంగా టీడీపీకి ఉంటే.. ఎయిమ్స్ విశాఖలోనే ఏర్పాటు చేసేవారు. కానీ అమరావతిలో భూములు కేటాయించి నిర్మించారు.
- చివరికి ఈ దఫాలోనూ అదే పల్లవి అందుకున్న చంద్రబాబు చివరిగా చెప్పిన మాట అందర్నీ విస్మయానికి గురి చేస్తోంది. విశాఖ నగరం అంటే.. ప్రపంచస్థాయి సదస్సులకు కేరాఫ్‌గా మారింది. జీ20, గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023తో పాటు విభిన్న అంతర్జాతీయ సదస్సులు జరిగాయి. ఇకపై అమరావతిలో గ్లోబల్ సమ్మిట్స్ నిర్వహిస్తామంటూ రెండు రోజుల క్రితం మెడ్‌టెక్ జోన్‌లో జరిగిన సదస్సులో చంద్రబాబు చెప్పడం చూస్తే.. విశాఖలో ఇకపై అంతర్జాతీయ సదస్సులు జరగబోవని స్పష్టమవుతోంది.
- వైఎస్సార్‌సీపీ హయాంలో విశాఖ నగరం అద్భుతంగా రూపుదిద్దుకుంది. అంతర్జాతీయ సంస్థలు ఇన్ఫోసిస్, డబ్ల్యూఎన్ఎస్, యాక్సెంచర్, రాండ్‌స్టాడ్ మొదలైన దిగ్గజ ఐటీ, ఐటీ అనుబంధ సంస్థలు విశాఖకు క్యూ కట్టాయి. జీఐఎస్-2023లో 46 దేశాల ప్రతినిధులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు హాజరై విశాఖ అభివృద్ధిని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారు. ఇలా అన్ని రంగాల్లోనూ విశాఖను ముందుకు తీసుకెళ్తూ.. కార్యనిర్వాహక రాజధానిగా అభివృద్ధి చేసేందుకు ఐదేళ్లలోనే అడుగులు వేసింది. కానీ మూడు దశాబ్దాలుగా ఆర్థిక రాజధాని చేస్తామంటూ బీరాలు పలుకుతున్న చంద్రబాబు ప్రభుత్వం మాత్రం వైజాగ్ అంటే నిరంతరం ఏదో ఒక రకంగా వివక్ష చూపిస్తూనే ఉంది.

న్యూస్‌రీల్

వామనావతారంలో జగన్నాథుడు



చోడవరం: జగన్నాథస్వామి శుక్రవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చోడవరం బోశ్లవీధి రామాలయంలో వేంచేసి ఉన్న బలభద్ర, సుభద్ర సమేతుడైన శ్రీ జగన్నాథస్వామికి రథోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఆరో రోజున స్వామివారు వామనావతారంలో భక్తులను కరుణించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- కలెక్టర్ విజయ కృష్ణన్



పారిశ్రామిక ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

అనకాపల్లి: జిల్లాలో ఉన్న పరిశ్రమల్లో పూర్తి స్థాయి భద్రతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ కె.విజయ కృష్ణన్ అన్నారు. తన కార్యాలయంలో పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీలతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అనేకం ఉన్నాయని, పరిశ్రమల నిర్వహణకు జిల్లా యంత్రాంగం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఆమె పేర్కొన్నారు. అచ్యుతాపురం పరిశ్రమల సంఘం సభ్యులు మాట్లాడుతూ అచ్యుతాపురం నుంచి పరవాడ రోడ్డు మరమ్మతు పనులు, పరిశ్రమలలో పనిచేసే వారికి బస్సు సౌకర్యం, పరిశ్రమలకు హెచ్.టి.పవర్ సప్లై, నీటి చార్జీలు, లోడింగ్/అన్ లోడింగ్ సమస్యలు, ట్రక్ పార్కింగ్, డ్రైనేజ్ సమస్యలపై అధికారులు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, ఎ.పి.ఐ.ఐ.సి. జోనల్ మేనేజర్ హరిప్రసాద్, భూగర్భ గనుల శాఖ, కార్మిక శాఖ, వివిధ పరిశ్రమల కమిటీ సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కొద్దిసేపు పనిచేయని రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు

తాటిచెట్లపాలెం(విశాఖ): విశాఖపట్నం రైల్వే రిజర్వేషన్ కౌంటర్లు శుక్రవారం కొద్దిసేపు పని చేయలేదు. రిజర్వేషన్ సిస్టం (క్రిస్) కోల్‌కతాలో పలు నిర్వహణ, మార్పులను చేపట్టడంతో సుమారు అరగంటసేపు రిజర్వేషన్ సిస్టంలు పనిచేయలేదని అధికారులు తెలిపారు.

నాడు సిద్ధాంతాలు..నేడు రాద్ధాంతాలు

- రాజకీయాల పట్ల ప్రజల్లో గౌరవం తగ్గిపోతోంది
- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

కొమ్మాది (విశాఖ): నాటి రాజకీయాల్లో సిద్ధాంతాలు ఉండేవని..నేడు రాద్ధాంతాలే జరుగుతున్నాయని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. అందుకే రాజకీయ నాయకుల పట్ల ప్రజల్లో గౌరవం రానురానూ తగ్గిపోతోందన్నారు. వెంకయ్యనాయుడు 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సాయంత్రం రుషికొండలో గల ఏ 1 గ్రాండ్‌లో మిత్రులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయాల్లో నిదానంగా మార్పు వస్తుందని కులం, మతం, డబ్బు వంటి వాటి ప్రభావం పెరుగుతుందన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితం హాయిగా నడిచిందని సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ అన్నా.. సముద్ర తీరం అన్నా చాలా ఇష్టమని తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రజలు ఉత్తములని పేర్కొన్నారు. ఆత్మీయ సభలో పాల్గొన్న మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు, హోం మంత్రి వంగలపూడి అనిత, స్పీకర్ అయ్యన్న పాత్రుడు, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, కామనేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

విద్యార్థినుల అస్వస్థతతో అధికారులు అప్రమత్తం

- వడ్డాది పాఠశాలను సందర్శించిన డీపీ
- ఆస్పత్రిలో రిపోర్టుల పరిశీలన
- ల్యాబ్‌కు ఫుడ్ శాంపిల్స్ తరలింపు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌లో అస్వస్థతకు గురైన పదో తరగతి విద్యార్థినులను జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి శుక్రవారం పరామర్శించారు. గురువారం ఇక్కడ ఆరుగురు పదో తరగతి విద్యార్థినులు అస్వస్థతకు గురై స్పృహ తప్పి పడిపోగా వడ్డాది, చోడవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. రెండో రోజు కూడా పదో తరగతి విద్యార్థిని వేద దివ్య పాఠశాలలో స్పృహ తప్పి పడిపోగా ఉపాధ్యాయులు స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న విద్యార్థినితోపాటు అస్వస్థతకు గురై ఇళ్ల వద్ద కోలుకుంటున్న ఐదుగురు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితులను డీపీవో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్నాక లేదా తినక ముందు అస్వస్థతకు గురయ్యారా అని వారిని ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం తినక ముందే జరిగిందని వివరించారు. బోధనలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వారి మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. హైస్కూల్‌కు వెళ్లి మరుగుదొడ్లు, మంచినీటి సరఫరా, పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఇక్కడ గ్రౌండ్‌లో తుప్పలు తొలగించి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని హెచ్‌ఎం శేషుబాబును ఆదేశించారు. మధ్యాహ్న భోజన పదార్థాల శాంపిల్స్‌ను ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీజ సేకరించి ల్యాబ్‌కు తరలించారు. 14 రోజుల తర్వాత రిపోర్టులు వస్తాయని తెలిపారు. జిల్లా వైద్య వ్యాధి నిరోధక అధికారి చంద్రశేఖర్ వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చి విద్యార్థినుల మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. ఎంపీడీవో వెంకటాచార్య, ఎంఈవోలు జయలక్ష్మి, కాశీ విశ్వేశ్వరరావు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



వడ్డాది పాఠశాలను తనిఖీ చేసి హెచ్‌ఎం, సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో శిరీషారాణి



వడ్డాది ఆస్పత్రిలో బాధిత విద్యార్థినుల బ్లడ్ రిపోర్టులను పరిశీలిస్తున్న డీఐవో చంద్రశేఖర్

రైతంటే ఎందుకంత అలుసు?

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా **సాగునీటి కాలువలపై దృష్టి సారించని ప్రభుత్వం**
- పూడిక, తుప్పలతో **పేరుకుపోయిన** రైవాడ జలాశయం **కుడి, ఎడమ కాల్వలు**
- నీరు విడుదల చేసినా చివరి ఆయకట్టుకు **చేరని పరిస్థితి**
- అసలే అంతంతమాత్రంగా నీటి నిల్వలు.. ఆపై **నిర్లక్ష్యం**
- రైవాడ రిజర్వాయర్‌పై **ఆధారపడ్డ** 15,343 ఎకరాల **ఆయకట్టు**

రైవాడ జలాశయం కుడి, ఎడమ ప్రధాన కాలువలతోపాటు పిల్ల కాలువలు సైతం తుప్పలు, డొంకలు, పూడికతో నిండిపోయాయి. ఎక్కడ చూసినా కాలువలు కనిపించడం లేదు. సాగుకు నీటిని విడుదల చేసినా ఆయకట్టు భూములకు చేరే పరిస్థితి కనిపించకపోవడంతో రైతాంగం తీవ్ర ఆవేదన చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులైనా ఖరీఫ్ సీజన్‌లో సాగు పరిస్థితిపై దృష్టి సారించకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతున్నారు.

దేవరాపల్లి: వ్యవసాయం అంటే చంద్రబాబుకు ఎప్పుడూ నిర్లక్ష్యమే. గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రైతన్నను పట్టించుకోలేదు. ఇప్పుడు కూడా అదే ధోరణిని కొనసాగిస్తున్నారు. రైతాంగం పైన, సాగునీటి ప్రాజెక్టులపైన రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకంత చిన్నచూపో అర్థం కాని పరిస్థితి. ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు జలాశయాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. జలాశయం పరిధిలోని సాగునీటి కాలువల్లో పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్, మరమ్మతులు చేపట్టడం ఆనవాయితీ. జిల్లాలో వేలాది ఎకరాలకు సాగు నీరు, విశాఖ నగరవాసులకు తాగునీరందించే రైవాడ జలాశయంపై ప్రభుత్వం ఈ ఏడాది నిర్లక్ష్య ధోరణి వహించడం పట్ల అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

జలాశయం స్థితిగతులు..

రైవాడ జలాశయం పరిధిలో దేవరాపల్లి, కె.కోటపాడు, చోడవరం మండలానికి చెందిన 15,343 ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 10 వేల మంది రైతులకు పైబడి జలాశయం నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. జలాశయం నుంచి పంట పొలాలకు నీరందించే కుడి, ఎడమ కాలువలు ఉన్నాయి. ఎడమ కాలువ 15.30 కిలోమీటర్ల మేర, కుడి కాలువ 12.30 కిలోమీటర్ల మేర పొడవున ఉన్నాయి. 9 పిల్ల కాలువలు ఉన్నాయి. జలాశయంపై ఆధారపడిన చెరువులు 60 వరకు ఉన్నాయి. జలాశయం నుంచి 30 గ్రామాలకు సాగునీరు అందుతుంది.



బ్రాందీ సీసాలతో దర్శనమిస్తున్న కాశీపురం, చిననందిపల్లి గ్రామాలకు సాగునీరందించే పంట కాలువ

అసలే అరకొరగా నీటి నిల్వలు..

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో పడిన చిన్నపాటి వర్షాలు మినహా ఆశించిన స్థాయిలో వానలు కురవలేదు. దీంతో రైవాడ జలాశయంలో నీటి నిల్వలు అంతంతమాత్రంగా ఉన్నాయి. అసలే అరకొరగా నీరున్న పరిస్థితిలో కాలువలు తుప్పలు, పూడికతో నిండిపోవడంతో కొద్దిపాటి నీటిని విడిచి పెట్టినా పంటకు చేరని పరిస్థితి దాపరించింది. దీంతో ఇప్పటికే విత్తనాలు కొనుగోలు చేసి నారుమడులు సిద్ధం చేసుకున్న అన్నదాతలను సాగునీటి భయం వెంటాడుతోంది. పాలకుల నిర్లక్ష్యం కారణంగా వరుణుడి కరుణ కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 105.50 మీటర్ల వద్ద నిలకడగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి 107 మీటర్లకు పైబడి నీటిమట్టం ఉంది. అయితే ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీటిని విడతల వారీగా విడుదల చేస్తే దమ్ములకు మాత్రమే సరిపోయే పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యుద్ధప్రాతిపదికన కాలువల్లో తుప్పలు, పూడిక తొలగించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేస్తున్నారు.



పెదనందిపల్లి వద్ద పూడికతో నిండిపోయిన పంట కాలువ




తుప్పలు, డొంకలతో మూసుకుపోయిన రైవాడ జలాశయం పంట కాలువ



అడుగంటిన రైవాడ రిజర్వాయర్

ప్రతిపాదనలు పంపించాం



రైవాడ జలాశయంపై చిన్నపాటి మరమ్మతుల తోపాటు పంట కాలువల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తొలగింపునకు సుమారు రూ.2 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించాం. నిధులు విడుదల కాగానే పనులు చేపడతాం. ప్రస్తుతం జలాశయంలో ఉన్న నీరు ఖరీఫ్ దమ్ములకు మాత్రమే సరిపోతుంది. రైతులు కోరిన వెంటనే దమ్ములకు వంతులవారీగా నీటిని విడుదల చేస్తాం.

–జి.సత్యంనాయుడు, డీఈ, రైవాడ జలాశయం

పోలీస్ గ్రీవెన్స్‌కు 8 అర్జీలు



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డేకు 8 మంది సిబ్బంది హాజరై ఎస్పీ కె.వి.మురళీకృష్ణ దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లారు. అనారోగ్య, ఉద్యోగ, వ్యక్తిగత సమస్యలపై అర్జీలు అందినట్లు ఎస్పీ చెప్పారు. సిబ్బంది సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యేలా శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్ల మార్పిడికి అవకాశం

మురళీనగర్ (విశాఖ): ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారంతో ముగిసింది. దీంతో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్‌లోని హెల్ప్‌లైన్ కేంద్రానికి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకున్నారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కూడా నిర్వహించి వీరికి వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి సిబ్బంది సహకరించారు. వీరు తమ ఆప్షన్లను ఫ్రీజ్ చేశారు. శనివారం ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సూచించారు. ఈనెల 16న సీట్లు కేటాయిస్తారు. 17నుంచి 22 తేదీ వరకు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టు ఆన్‌లైన్‌లో చేసి కాలేజీలకు ఆ రిపోర్టు సమర్పించాలని ఆయన చెప్పారు. ఇదిలా ఉండగా పాలిసెట్ ఆఖరి దశ కౌన్సెలింగ్ శుక్రవారం కొనసాగింది. విద్యార్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. పలువురు విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి ఆప్షన్లు పెట్టుకున్నారు. శనివారంతో పాలిటెక్ వెబ్ ఆప్షన్ల గడువు ముగుస్తుంది.

క్లుప్తంగా

శాకంబరీ దేవిగా కన్యకాపరమేశ్వరి



అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డులో కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రతిష్ట శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు అన్నారు. స్థానిక అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశామని చెప్పారు. ఉత్సవాల కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్ళపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

- అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఏడీ శ్రీధర్



సదస్సులో సూచనలిస్తున్న ఏడీ శ్రీధర్

మాకవరపాలెం: రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని అనకాపల్లి రైతు శిక్షణ కేంద్రం ఏడీ శ్రీధర్ సూచించారు. మండలంలోని గిడుతూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే దిగుబడులు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవోలు చిరంజీవి, విజేత, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజాబాబు పాల్గొన్నారు.

ఫ్రూట్ ఫుల్ లాభాలు

- భారీగా పనస, పైనాపిల్, సీతాఫలాల దిగుబడులు
- ఘాట్‌రోడ్డులో జోరందుకున్న అమ్మకాలు
- మైదాన ప్రాంతాలకు భారీగా రవాణా
- రిటైల్ అమ్మకాలకు ఆదరణ



పనస, పైనాపిల్, సీతాఫలాలు



వంట్లమామిడిలో రిటైల్‌గా అమ్ముతున్న పనస, పైనాపిల్, సీతాఫలాలు

సాక్షి,పాడేరు: కమ్మని రుచుల గల పనస, పైనాపిల్, సీతాఫలాల విక్రయాలకు పాడేరు ఘాట్ రోడ్డు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. పండ్ల అమ్మకాలతో ఈ రోడ్డులోని రాజాపురం, 12వ మైలురాయి జంక్షన్, వంట్లమామిడి ప్రాంతాలు సందడిగా మారాయి. గత రెండు నెలల నుంచి పనస,పైనాపిల్ పండ్లు భారీగా దిగుబడి కాగా, తాజాగా సీతాఫలాలు కూడా అమ్మకాలు ప్రారంభం కావడంతో ఈ మూడు ఫలాలను మైదాన ప్రాంతాలకు వ్యాపారులు భారీగా తరలిస్తున్నారు. రిటైల్‌గాను అమ్మకాలు జోరందుకున్నాయి. ఈ దారి వెంబడి ప్రయాణించే ప్రయాణికులు,దూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు ఈ మధుర ఫలాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఘాట్ రోడ్డులో పండ్ల దుకాణాలు నిత్యం సందడిగా ఉంటున్నాయి. గిరిజన రైతులు, వ్యాపారులకు మంచి లాభాలు వస్తున్నాయి.

ఏప్రిల్ నెలాఖరు నుంచి పనసపండ్ల దిగుబడి రావడంతో అప్పటి నుంచి ఈ పండ్ల అమ్మకాలను భారీగా జరిగాయి. ఈ ప్రాంతంలోని పలు పంచాయతీలకు చెందిన గిరిజనులు పనస పండ్లను విక్రయించి మంచి లాభాలు పొందుతున్నారు. రూ.100నుంచి రూ.150 ధరతో ఒక్కో పండును విక్రయిస్తున్నారు. దీంతో రోజువారి కనీసం రూ.1000 వరకు ఆదాయం పొందుతున్నారు. జూన్ మొదటి వారం నుంచి పైనాపిల్ దిగుబడికి రావడంతో వీటి అమ్మకాలు కూడా జోరందుకున్నాయి. వంట్లమామిడి, సలుగు, దేవాపురం, మోదాపల్లి, అయినాడ పంచాయతీల పరిధిలో 600 ఎకరాల విస్తీర్ణంలో పైనాపిల్ తోటలు ఉన్నాయి.ఈఏడాది కూడా కాపు ఆశాజనకంగా ఉండడంతో వాటి అమ్మకాల ద్వారా ప్రతి గిరిజన రైతు రూ.20వేల వరకు ఆదాయం లభించింది. మరో నెల రోజుల వరకు వీటి అమ్మకాలు ఉంటాయి.అలాగే సీతాఫలాలకు కూడా ఈప్రాంతం పేరొందింది. పాడేరు, జి.మాడుగుల మండలాల్లో 1,250 ఎకరాల్లో గిరిజన రైతుల సీతాఫలాల తోటలను సాగు చేస్తున్నారు.గత 10రోజుల నుంచి సీతాఫలాల దిగుబడులు ప్రారంభం కావడంతో వంట్లమామిడి,12వ మైలురాయి జంక్షన్లలో బుట్టలతో రోజువారీఅమ్మకాలు జరుపుతున్నారు. పెద్ద బుట్ట పండ్లు రూ.700కు విక్రయిస్తున్నారు. మున్ముందు ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.ఈ మూడు ఫలాల అమ్మకాలతో పాడేరు ఘాట్‌రోడ్డులో సందడి వాతావరణం నెలకొంది.ప్రతి ఆదివారం వంట్లమామిడి సంతలో అన్ని పండ్ల వ్యాపారం రూ.లక్షల్లో జరుగుతోంది.





పైనాపిల్, పనస

పైనాపిల్‌తో రూ.20వేల ఆదాయం



ఈఏడాది పైనాపిల్ అమ్మకాల ద్వారా రూ.20వేల ఆదాయం పొందాను.ఎకరన్నర మెట్ట భూమిలో పైనాపిల్‌ను పూర్వం నుంచి సాగు చేస్తున్నాం. ఒక్కో పండు రూ.15 చొప్పున విక్రయించాను. మైదాన ప్రాంత వ్యాపారులు గ్రామానికి వచ్చి కొనుగోలు చేశారు.పైనాపిల్ సాగు ఈసీజన్‌లో ఆర్థికంగా ఆదుకుంది.

– కొండపల్లి చంద్రమ్మ, పైనాపిల్ రైతు, పూలబంద, పాడేరు మండలం

సీతాఫలాల విక్రయాలతో లాభాలు



సీతాఫలాల దిగుబడులు ప్రారంభమయ్యాయి.గత ఏడాది వలే చెట్లకు కాపు బాగుంది.పక్వానికి వచ్చిన కాయలను సేకరించి గత వారం రోజుల నుంచి 12వమైలురాయి జంక్షన్‌లో వ్యాపారులకు విక్రయించాను. బుట్ట పండ్లకు రూ.700 చొప్పున ధర లభించింది.గత ఏడాది సీతాఫలాల పంట ద్వారా రూ.25వేల ఆదాయం వచ్చింది.

– వేమల లింగంరాజు, పూలబంద, వంట్లమామిడి పంచాయతీ, పాడేరు.

తీరప్రాంతంలో 'సాగర్ కవచ్'

సింథియా : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తీరప్రాంత భద్రతను అంచనా వేయడమే లక్ష్యంగా రెండు రోజులపాటు నిర్వహించిన సాగర్‌కవచ్ నిర్వహించారు. ఈ వ్యాయామంలో ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్ గార్డ్, సీఐఎస్ఎఫ్, కస్టమ్స్, ఆర్పీఎఫ్, స్టేట్ పోలీస్, మెరైన్ పోలీస్, ఫిషరీస్, ఐబీ, పోర్ట్ అథారిటీస్ వంటి స్టేట్ ఏజెన్సీలు చురుగ్గా పాల్గొన్నాయి. తూర్పు నౌకాదళ కమాండ్ పరిధిలోని నేవల్, కోస్ట్‌గార్డ్ వైమానిక ఆస్తులు రెండింటి ద్వారా తీరప్రాంతంపై విస్తృతమైన వైమానిక నిఘా చేపట్టిన ఈ వ్యాయామంలో భారత నౌకాదళ నౌకలు, కోస్ట్‌గార్డ్ నౌకలు పాల్గొని విన్యాసాలు ప్రదర్శించినట్లు నేవీ వర్గాలు తెలిపాయి.



విన్యాసాల్లో పాల్గొన్న నౌకలు

నెలాఖరు నుంచి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ

- డీఈవో వెంకటలక్ష్మమ్మ



మాట్లాడుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి: జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ నెలాఖరు నుంచి భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక గవరపాలెం చిన్న హైస్కూల్ ఆవరణలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో 50 పాఠశాలల నుంచి 108 ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన జిల్లాలో మొదటిసారిగా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌పై శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రవేశ శిక్షణ మూడు నుంచి ఆరు నెలలు, ప్రథమ, ద్వితీయ, తృతీయ శిక్షణ ఆరు మాసాల చొప్పున, రాజపురస్కార్ శిక్షణ సంవత్సరం ఇచ్చి సర్టిఫికెట్లను విద్యార్థులకు ప్రదానం చేస్తామని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో న్యూనతాభావం తగ్గి భావితరాలకు మంచి విశ్వాసపాత్రులై, సేవాతత్పరత అలవడుతుందన్నారు. సర్టిఫికెట్స్ పొందిన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ (ఎన్‌సీసీ సర్టిఫికెట్స్ మాదిరిగా) సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.రత్నకుమారి, రాష్ట్ర శిక్షణాధికారి మోహన్‌రావు, పర్యవేక్షకుడు రామలింగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బీ అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష



అధికారులతో సమావేశమైన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: నర్సీపట్నం మెయిన్ రోడ్డు, ఆరిలోవ రిజర్వ్‌ఫారెస్ట్‌లో నాణ్యతపై చర్యలు తీసుకోమని ఇచ్చిన ఆదేశాలు ఎంతవరకు అమలు చేశారని అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధికారులను నిలదీశారు. శుక్రవారం తన నివాసంలో ఆర్‌అండ్‌బీ, దేవదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 22వ తేదీలోగా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అబిడ్ సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు విస్తరించిన ఆర్‌అండ్‌బీ మెయిన్‌రోడ్డుపై మున్సిపల్ అధికారులు పెత్తనం చేయటమేమిటన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారులకు లేదా అని ప్రశ్నించారు. నర్సీపట్నం పెద్ద చెరువు ప్రాంతాన్ని ట్యాంక్‌బండ్ మాదిరిగా అభివృద్ధి చేయడానికి రూపొందించిన ప్రతిపాదనలకు సంబంధించిన పనులు ఏ స్థాయిలో ఉన్నాయో తెలియజేయాలన్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహం పనులు ప్రారంభించాలని ఆదేశించారు. నూకాంబిక ఆలయ అభివృద్ధికి సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ ఇచ్చిన రూ.10 లక్షల విరాళం సొమ్మును దేనికి ఖర్చు పెట్టారని ఎండోమెంట్ అధికారులను ప్రశ్నించారు. ఈ నిధులపై వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

వరిలో కలుపు యాజమాన్య పద్ధతులు

అనకాపల్లి: వరి విత్తిన వెంటనే ప్రేటిలక్లోర్ కలుపు మందును ఎకరానికి 600 మి.లి. లేదా పెండిమిథాలిన్ 38.7 శాతం సి.ఎస్.700 మి.లి. 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిచేటట్టు పిచికారీ చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బి.మోహనరావు తెలిపారు. ఈ మేరకు కలుపు యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. విత్తిన 20 రోజుల వరి పైరులో గడ్డి, వెడల్పాటి కలుపు సమస్య ఉన్నప్పుడు బిస్పైరిబాక్ సోడియం ఎకరాకు 100 మి.లి. 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిచేటట్టు పిచికారీ చేయాలి. గడ్డి జాతి కలుపు ఎక్కువగా ఉన్నప్పుడు ఫెనోక్సాప్రోప్ .పి. ఇథైల్‌ను 350 మి.లి. 200 లీటర్ల నీటిలో కలిపి బాగా తడిచేటట్టు ఎకరా పొలంలో పిచికారీ చేయాలి. విత్తిన 30 రోజుల వయసు గల పైరులో వర్షాల వల్ల కలుపు సమస్య పెరిగే అవకాశం ఉన్నందున 2,4 డి అమైన్ సాల్టు 58 శాతం, ఈసీ 2.మి.లి., 10 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేని పక్షంలో ఆల్మిక్స్ కలుపు మందును ఎకరాకు 8 గ్రాముల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

నేరుగా విత్తిన వరిసాగు వల్ల ప్రయోజనాలు...

ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు, కూలీల కొరత వల్ల చాలా వరకు రైతులు ఎద వరి పద్ధతి (నేరుగా విత్తే పద్ధతి) వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ పద్ధతి ద్వారా కూలీల ఖర్చు తగ్గడమే కాకుండా నారుమడి పెంచే సమయం కలిసి రావడం వల్ల 20–25 రోజుల ముందే కోతకు వస్తుంది. ఈ పద్ధతి ద్వారా రూ.3 వేల నుంచి రూ.4 వేలు ఖర్చు తగ్గుతుంది. సాగు చేయడంలో ప్రధాన సమస్య కలుపు పెరుగుదల, కలుపు నివారణకు సరైన సమయంలో సూచించిన మోతాదులో కలుపు మందు వేసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చు.

కార్పొరేట్ సంస్థల్లో నాయకత్వ ప్రతిభ అవసరం

- సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ మురళీ కృష్ణ



మాట్లాడుతున్న మురళీకృష్ణ

బీచ్‌రోడ్డు : గ్లోబల్ ఎకోసిస్టమ్‌కు ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ (నీతి) అవసరమని సీఐఐ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ డాక్టర్ మురళీ కృష్ణ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో మేక్ ఇన్ ఇండియా, ఇండియన్ ఎకోసిస్టమ్‌లో ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల్లో నాయకత్వ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నప్పటికీ, నైతిక, ప్రామాణికమైన నాయకత్వాన్ని పెంపొందించడానికి ఇండియన్ మేనేజ్‌మెంట్ ఎథోస్ అత్యవసరమన్నారు. వైవిధ్యం, సమానత్వం ప్రోత్సహించే కార్యక్రమాలు వివక్ష, అసమానతలను పరిష్కరించడంలో ప్రధానమైనవన్నారు. ఈ కార్యక్రమాన్ని వర్చువల్ విధానం ద్వారా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి సౌరభ్ గౌర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వ రంగంలో బలమైన నాయకత్వం, నైపుణ్యగణన ఆవశ్యకతను వివరించారు. సదస్సులో సీఐఐ సదరన్ రీజియన్ ఈడీ పద్మకుమార్, కె. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సాధారణ ప్రయాణికులకు శుభవార్త

- పలు రైళ్లకు అదనపు జనరల్ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: సాధారణ ప్రయాణికులకు రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. పలు రైళ్లకు అదనంగా జనరల్ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. అంచెలంచెలుగా మొత్తం 46 రైళ్లకు రెండేసి చొప్పున మొత్తం 92 నూతన జనరల్ కోచ్‌లను జతచేయనున్నారు. విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే హౌరా-సికింద్రాబాద్-హౌరా(12703/12704)ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, హైదరాబాద్-విశాఖపట్నం-హైదరాబాద్(12728/12727) గోదావరి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్-సికింద్రాబాద్(17016/17015)విశాఖ ఎక్స్‌ప్రెస్, న్యూటిన్‌సుకియా-ఎస్ఎంవీ బెంగళూరు (22502/22501) ఎక్స్‌ప్రెస్, డిబ్రూఘడ్-కన్యాకుమారి-డిబ్రూఘడ్(22504/22505) వివేక్ ఎక్స్‌ప్రెస్, సిల్చాట్-తాంబరం-సిల్చాట్(15630/15629) నాగోన్ ఎక్స్‌ప్రెస్, గౌహతి-బెంగళూరు-గౌహతి(12510/12509) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు త్వరలో నూతన జనరల్ కోచ్‌లు జతచేయనున్నారు

నవంబర్ నుంచి అదనపు జనరల్ కోచ్‌లను జతచేయనున్న రైళ్లు ఇవే..

- విశాఖపట్నం-న్యూఢిల్లీ-విశాఖపట్నం (22805/22806) ఏపీ ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-కోర్బా-విశాఖపట్నం (18517/18518) కోర్బా ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-కడప-విశాఖపట్నం (17487/17488) తిరుమల ఎక్స్‌ప్రెస్
- విశాఖ-హజరత్ నిజాముద్దీన్-విశాఖ (12803/12804) స్వర్ణజయంతి ఎక్స్‌ప్రెస్
- విశాఖ-హజరత్ నిజాముద్దీన్-విశాఖ(12807/12808) సమతా ఎక్స్‌ప్రెస్
- విశాఖ-లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ(వయా రాయగడ) (22847/22848) ఎక్స్‌ప్రెస్
- విశాఖపట్నం-ధీఘా-విశాఖపట్నం (22874/22873) ఎక్స్‌ప్రెస్
- విశాఖ-లోకమాన్యతిలక్ టెర్మినస్-విశాఖ (18519/18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-బెంగళూరు-భువనేశ్వర్(18463/18464)ప్రశాంతి ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-పుణే-భువనేశ్వర్(22882/22881) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్(22879/22880) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-తిరుపతి-భువనేశ్వర్(22871/22872)ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-చెన్నై సెంట్రల్ -భువనేశ్వర్(12830/12829) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-ఎస్ఎంవీ బెంగళూరు-భువనేశ్వర్(12845/12846) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-పుదుచ్చేరి-భువనేశ్వర్(12898/12897) ఎక్స్‌ప్రెస్
- భువనేశ్వర్-రామేశ్వరం-భువనేశ్వర్(20896/20895)ఎక్స్‌ప్రెస్
- పూరీ-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-పూరీ(22859/22860) ఎక్స్‌ప్రెస్

సచివాలయ కార్యదర్శుల కొట్లాటపై విచారణ

గాజువాక: గాజువాక జోన్ 67వ వార్డు జోగవానిపాలెం సచివాలయం కార్యదర్శుల కొట్లాట ఘటనపై జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్, యూసీడీ విభాగం అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. కొట్లాటకు పాల్పడిన కార్యదర్శులతోపాటు అదే సచివాలయంలో పని చేస్తున్న ఇతర కార్యదర్శులు, సిబ్బందిని టౌన్‌ప్లానింగ్ ఏసీపీ లింగేశ్వరరెడ్డి, టీపీబీవో రేవతి, యూసీడీ ఏపీడీ ఎల్.రాము విచారించి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. పింఛన్ల పంపిణీకి సంబంధించిన డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన పని తనది కాదంటే తనది కాదంటూ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ జల్లూరు సమరం, ప్లానింగ్ సెక్రటరీ అన్నెపు శ్రీనివాస్ ఒకరినొకరు కొట్టుకున్నారు. వారిని విడదీయడానికి ప్రయత్నించిన అడ్మిన్ కార్యదర్శి రమణిని పక్కకు నెట్టేయడంతో ఆమె చేతికి గాయమైంది. దీనిపై సమాచారం అందుకున్న జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు సంబంధిత కార్యదర్శులను పిలిపించి మందలించడంతోపాటు వారిపై విచారణ చేపట్టాలని యూసీడీ అధికారులను ఆదేశించారు.

దీంతో సచివాలయంలోని వివిధ విభాగాల కార్యదర్శులు, అడ్మిన్‌లను అధికారులు విచారించారు. కొట్లాట జరిగినట్టు వారు అంగీకరించారని, దీనిపై తదుపరి చర్యలకు జోనల్ కమిషనర్‌కు నివేదిక అందించామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

ప్రైవేటు ఉద్యోగిపై మద్యం మత్తులో దాడి

- ముగ్గురు నిందితులపై కేసు

పాయకరావుపేట: పట్టణంలోని మంగవరం రోడ్డులో ముగ్గురు నిందితులు మద్యం సేవించి, అదే రోడ్డుపై నడిచి వెళ్తున్న హెట్రో కంపెనీ ఉద్యోగి ఎం.వెంకటేశ్వరరావును అడ్డగించి కొట్టారు. వారిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ బి.జోగారావు శుక్రవారం తెలిపారు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో పత్రివారి వీధిలో తన స్వగృహానికి హెట్రో ఉద్యోగి నడిచి వెళ్తున్నాడు. అదే సమయంలో పాత హరిజనవాడకు చెందిన జక్కల శ్రీనివాస్, కిల్లాడ ఇస్సాకు, సయ్యద్ బాబా తాగిన మైకంలో సదరు ఉద్యోగిని అడ్డగించి పిడిగుద్దులు గుద్దారు. దాంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైకు అదుపు తప్పి బోల్తా

- ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



గాయపడిన సీహెచ్ అంజి



తీవ్ర గాయాలతో కె.అంజి

ఎస్.రాయవరం: మండలంలోని అడ్డురోడ్డు సమీపంలో శుక్రవారం బైకు అదుపు తప్పి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు... తుని మండలం ఇసుకపేటకు చెందిన సీహెచ్.అంజి, నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామానికి చెందిన కె.అంజి తమ బైకుపై విశాఖపట్నం వైపు ప్రయాణిస్తూ అదుపు తప్పి బోల్తా పడ్డారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు నక్కపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం మెరుగైన వైద్య సేవల కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. వీరిలో కె.అంజి పరిస్థితి విషమంగా ఉన్నట్టు ఎస్.రాయవరం హెచ్‌సీ భూలోకరావు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు నూకరాజు (ఫైల్)

భోగాపురం: విజయనగరం జిల్లా భోగాపురం మండలం సుందరపేట సమీపంలో శక్రవారం ఉదయం జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని మరో లారీ బలంగా ఢీ కొనడంతో డ్రైవర్ గంధ్రేడి నూరాజు(36) మృతి చెందగా, క్లీనర్ ఏనుగుల రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాపట్నం జిల్లా సబ్బవరం గ్రామానికి చెందిన నూకరాజు డ్రైవర్‌గా, అసరపల్లి గ్రామానికి చెందిన ఏనుగుల రాము క్లీనర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరూ లారీలో బిస్కెట్ ప్యాకెట్లను లోడు చేసుకుని సబ్బవరం నుంచి ఒడిశా బయలుదేరారు. సుందరపేట జాతీయ రహదారి వద్దకు చేరుకునే సరికి అప్పటికే టైర్ పగిలి రహదారిపై నిలిచిపోయిన లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో డ్రైవర్ నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. రాము తీవ్ర గాయాల పాలయ్యాడు. భోగాపురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం నూకరాజు మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి, తీవ్ర గాయాల పాలైన రామును విశాఖపట్నంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని సోదరుడు గంధ్రేడి వెంకినాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు.

మనస్తాపంతో యువతి ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిపురం దరి బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న కోనేని మహిత(25) సీఏ ఫైనల్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపం చెందింది. తన గదిలో శుక్రవారం ఉదయం ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చాలా సమయం అయినా మహిత తన గది నుంచి రాకపోవడంతో ఆమె తల్లికి అనుమానం వచ్చి తలుపు కొట్టింది. ఎటువంటి స్పందన లేకపోవడంతో స్థానికుల సాయంతో తలుపులు తెరిచింది. ఫ్యాన్‌కు వేలాడుతున్న కుమార్తెను వెంటనే ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

పరశురాముడిగా జగన్నాథుడు



అనకాపల్లి: జగన్నాథ స్వామి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక గూడ్స్‌రోడ్డులోని ఇంద్రద్యుమ్నహాల్లో సుభద్ర బలభద్ర సమేత జగన్నాథస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకుడు బంకుపల్లి సత్యనారాయణ నేతృత్వంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఉచిత ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో రాజసులోచన, ఉత్సవ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, డైరెక్టర్లు బొండా రాజేష్, మోహన్‌రావు, వెంకటచలపతిరావు, వెంకటవీర అప్పారావు, కోటేశ్వరరావు, ధనలక్ష్మి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వామనావతారంలో జగన్నాథుడు

కశింకోట: స్థానిక దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో జగన్నాథ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారిని శుక్రవారం దశావతారాల్లో ఐదవ అవతారం అయిన వామనుడిగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన జరిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోత్ర నామాలతో అర్చించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి శ్రీరామచరణాచార్యులు తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అభిరామ్



కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్ నుంచి టెన్త్‌లో అత్యధిక మార్కులు పొందిన వైఆర్ అభిరామ్ ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ఈ ఏడాది ఫలితాల్లో అభిరామ్ 583 మార్కులు సాధించి, మండలంలో మూడో స్థానంలో నిలిచాడు. ఈ నేపథ్యంలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపికై నట్లు హెచ్ఎం విజయలక్ష్మి సుమన్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని అభినందించారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	:రాజా
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-1
కల్కి2898 ఏడీ	:సత్యనారాయణ స్క్రీన్-2
భారతీయుడు 2	:షిర్డిసాయి
భారతీయుడు 2	:పర్లిసాయి
మనమే	:వెంకటేశ్వర
14	:శ్రీసత్య
సారంగదరియా	:రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 20 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	--	--
రెండో రకం	4,180	4,180
మూడోరకం	3,000	3,600

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 46 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 358 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 296 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (08924223595)ని సంప్రదించవచ్చు.

ఆస్పత్రి ఘనం.. సేవలు దైన్యం

- ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్య సేవలపై రోగుల అసంతృప్తి
- కనీస వసతులు కల్పించాలంటూ ఆవేదన
- అన్ని రోగాలకూ ఆరోగ్యశ్రీతో లింక్
- రిఫరల్ కాదు.. రిఫర్ చేస్తున్నారు!

జిల్లా కేంద్రంలో ఎన్టీఆర్ వైద్యాలయానికి సుస్తీ చేసింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చే రోగులకు వైద్య సేవలందించాల్సిన ఆస్పత్రి, సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజల అసంతృప్తికి గురవుతోంది. అసలే సీజనల్ రోగాలు ప్రబలే కాలం. ఈ సమయంలో మరింత నిబద్ధతతో పనిచేయాల్సిన సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దానికి తోడు అరకొర సౌకర్యాలు. పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని రోగులు, వారి బంధువులు ఆరోపిస్తున్నారు.



ఎన్టీఆర్ వైద్యాలయం



ఆరోగ్యశ్రీ కార్యాలయంలో రోగి కుటుంబ సభ్యులు



ఐసీయూ వార్డులో నర్సింగ్ విద్యార్థులు



అత్యవసర విభాగంలో వైద్యుల రూమ్‌లో పాడైన ఏసీ



అత్యవసర విభాగంలో అలంకారంగా మారిన ఏసీ

అనకాపల్లి: జిల్లా ప్రధాన ఆస్పత్రి ఎన్టీఆర్ వైద్యాలయానికి రోగుల తాకిడి పెరిగుతోంది. విషజ్వరాలు, ఇతర కారణాలతో రోజూ వందల సంఖ్యలో రోగులు వస్తున్నారు. వారికి వైద్య సేవలతో పాటు, కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు చొరవ చూపి, చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన సౌకర్యాలు, అంతే స్థాయిలో వైద్య సేవలు దక్కేలా చూడాలని కోరుతున్నారు.

రోగ నిర్ధారణ చేయకుండానే కేజీహెచ్‌కు!

ఆస్పత్రికి రెండు మాసాల క్రితం పలు వైద్య కళాశాలల్లో వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు శిక్షణ నిమిత్తం వైద్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. సీనియర్ వైద్యుల వద్ద శిక్షణ తీసుకోవడం మాట దేవుడికెరుక.. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తుల్ని కూడా విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. చాలాసార్లు కనీసం రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయట్లేదు. దీంతో రోగుల బంధువులు వైద్యాలయంలో సీనియర్ వైద్యులతో వాదనకు దిగడం పరిపాటిగా మారింది. తాజాగా ఇద్దరు రోగులను కేజీహెచ్‌కు రిఫర్ చేయడంతో వారి బంధువులు సీనియర్ వైద్యులను నిలదీశారు. దీంతో వారికి ఆస్పత్రిలోనే చికిత్స అందించారు.

అన్నింటికీ ఆరోగ్యశ్రీతో లింక్

ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉన్న అన్ని వైద్య పరీక్షలు, సేవలు ఉచితంగానే అందించాలి. ఇక్కడ మాత్రం సిబ్బంది తీరు విభిన్నం. ఆరోగ్యశ్రీలో పేర్లు నమోదు చేసి, అక్కడి నుంచి అనుమతి వస్తే తప్ప అసలైన వైద్య సేవలు అందవు. ప్రతి చిన్న ఆపరేషన్‌కూ ఆరోగ్యశ్రీతోనే లింక్ పెడుతున్నారు. దీంతో ఆరోగ్యశ్రీ కార్యాలయం రోగులు, వారి బంధువులతో రోజూ కిక్కిరిసిపోతోంది. ఇక్కడ శాశ్వత ఉద్యోగుల నుంచి ఔట్‌సోర్సింగ్ సిబ్బంది వరకూ ప్రతి ఒక్కరూ చేతివాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అలంకారప్రాయంగా ఏసీలు

ఆస్పత్రిలో అత్యవసర వైద్య విభాగం నుంచి వార్డుల్లో, వైద్యుల చాంబర్లలో ఏర్పాటు చేసిన ఏసీలు అలంకారప్రాయంగా మారాయి. వీటిని మరమ్మతులు చేసే పరిస్థితి కానరావట్లేదు. ఏ ఒక్క ఏసీ పనిచేయని పరిస్థితి. రక్తపరీక్షలు చేసే గదిలో ఎప్పుడో ఏసీలు మూలకు చేరాయి. దీంతో కొన్ని పరీక్షలు వేడి వాతావరణంతో తప్పుడు నివేదికలు వస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. ఇదంతా తెలిసినా ఆస్పత్రి అధికారులకు మాత్రం పట్టని పరిస్థితి.

రక్తమోడాల్సిందే..

డాక్టర్లు బ్లడ్ టెస్టులు రాస్తే ఆ రోగితో పాటు, వారి బంధువులూ ఇబ్బంది పడాల్సిందే. ఇక్కడ విధుల్లో ఉండే నర్సింగ్ విద్యార్థులు నిత్యం రోగులపై చిరాకు ప్రదర్శిస్తున్నారని బంధువులు ఆరోపిస్తున్నారు. చాలాసార్లు వారు ఖాళీగా ఉన్నా, ఫోన్లలో కాలం గడిపేస్తున్నారు తప్ప, తమను పట్టించుకోవట్లేదని వాపోతున్నారు. వార్డుల్లో రోగులకు వైద్యం అందించాల్సిన పర్మినెంట్ ఉద్యోగులది ఇంకో తీరు. వారు కూర్చున్న స్థానం నుంచి కదిలే పరిస్థితి లేదు. రోగులకు ఇంజక్షన్, సెలైన్ ఎక్కించే పని ఈ విద్యార్థులకే అప్పగిస్తున్నారు. దీంతో చాలాసార్లు రోగుల రక్తనాళాన్ని గుర్తించక, పదేపదే సూదులతో గుచ్చేస్తూ, రక్తమోడేలా చేస్తున్నారు.

ఆపరేషన్ కోసం పది రోజులుగా నిరీక్షణ

10 రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చాను. గైనిక్ వార్డులో డాక్టర్‌కు నా సమస్య చెప్పుకున్నా. శరీరంలో రక్తం ఎక్కువగా పోవడంతో తీవ్ర ఇబ్బంది పడే పరిస్థితి వస్తుందని, వెంటనే ఆపరేషన్ చేయించుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీలో నమోదు చేసుకున్న తర్వాత మాత్రమే ఆపరేషన్ చేస్తామన్నారు. ఆపరేషన్ తేదీ ఈ నెల 10 అని చెప్పడంతో 9వ తేదీన ఆస్పత్రికి వెళ్లి డాక్టర్‌ను కలిశాను. ప్రస్తుతం తనకు ఖాళీ లేదని, 17వ తేదీన ఆపరేషన్ చేస్తామని చెప్పి, వెనక్కి పంపించారు. అర్జెంట్‌గా ఆపరేషన్ అని చెప్పిన వాళ్లే, ఇలా జాప్యం చేయడంతో భయంగా ఉంది.

– ఎస్.లక్ష్మి, మామిడిపాలెం, అనకాపల్లి

మా దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారం

వైద్యాలయంలో ఎటువంటి సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే పరిష్కరిస్తున్నాను. ట్రెనింగ్ కళాశాల విద్యార్థులు విధుల పట్ల శ్రద్ధ చూపేలా ప్రత్యేక దృష్టి సారిస్తాను. వార్డులో ఎప్పటికప్పుడు పర్యటించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్నాను. శాశ్వత ఉద్యోగుల పని తీరు పట్ల కూడా దృష్టి పెడతా. అత్యవసర కేసుల్లో తప్పనిసరి పరిస్థితి ఉంటే తప్ప విశాఖలోని కేజీహెచ్‌కు రోగుల్ని రిఫర్ చేయకుండా చూస్తున్నా. సాధ్యమైనంత మేరకు ఇక్కడే అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటా.

– కె.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఎన్టీఆర్ వైద్యాలయం

జీతాలు చెల్లించాలని వినతి

అనకాపల్లి: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన మత్తు వ్యసన విముక్తి విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు జీతాల బకాయిలు చెల్లించాలని ఆస్పత్రి వద్ద శుక్రవారం ఉద్యోగులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ జి.కృష్ణచంద్ర, ఉద్యోగులు ఎస్.క్రాంత్‌కుమార్, బి.నాయుడుబాబు, జి.కీర్తన, జి.రాజ్యలక్ష్మి, ఎల్.శ్రీదేవి, చంద్రశేఖర్, ఎస్.వెంకటరావులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ఎంతో మంది మందుబాబులకు వైద్యం అందించి, విముక్తుల్ని చేసిన తమ గోడు పట్టించుకోవాలని కోరారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. రిలే దీక్షలు చేస్తున్న ఉద్యోగులకు ప్రజాసంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్, సీఐటీయూ జిల్లా కన్వీనర్ వి.వి.శ్రీనివాసరావు, పలు సంఘాల నేతలు సంఘీభావం పలికారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తుమ్మపాల: కొత్తూరు విద్యుత్ సెక్షన్ కార్యాలయం, కశింకోట సబ్‌స్టేషన్ పరిధిల్లోని 33/11 కేవీ ఫీడర్ల పీఎంఐ, సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీంతో మండలంలోని కొత్తూరు, పిసినికాడ, వేటజంగాలపాలెం, సంపతిపురం, వెంకుపాలెం, రొంగలివానిపాలెం, కుంచంగి, కూండ్రం, విసన్నపేట, రామన్నపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు, ప్రజలు తమకు సహకరించాల్సిందిగా కోరారు.

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ ఎస్.రామకృష్ణ శుక్రవారం తెలిపారు.

సబ్ స్టేషన్ పరిధిలోని కన్నూరుపాలెం, తీడ, చెరకాం, సుందరయ్యపేట, జి.భీమవరం, అచ్చెర్ల, మాకవరపాలెం మండలం రాజుపేట, శెట్టిపాలెం, దుంగవానిపాలెం, భీమబోయినపాలెం, రామన్నపాలెం, కొత్తపాలెం, జెడ్.గంగవరం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు.

ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల: ఎస్సీ, ఎస్టీ విద్యార్థి వసతి గృహాల్లో సరైన సౌకర్యాల్లేక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే జిల్లా కలెక్టర్ స్పందించి విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీల ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన ప్రదర్శన జరిపి, వినతి పత్రం అందించారు. గత ఆరు నెలలుగా వసతి గృహాల బకాయిలకు, కేవలం రెండు నెలల నిధుల విడుదలకు చర్యలు ప్రారంభించారని, ఇలాంటి సమస్యలు విద్యార్థులకు ప్రాణ సంకటంగా మారాయని ఆయా ప్రతినిధులు రాజాన దొరబాబు, శంకరరావు తెలిపారు. వసతి గృహాల్లో మరుగుదొడ్లు సక్రమంగా లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పీఎస్ అజయ్ కుమార్, భద్రం, విద్యార్థి నాయకుడు ఎ.ఫణీంద్ర, నగిరెడ్డి సత్యనారాయణ, మామిడి రమణ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే కొణతాలకు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు

తుమ్మపాల: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టి, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను కోరారు. శుక్రవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో కార్మిక ప్రతినిధుల బృందం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందించింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు, సంక్షేమ పథకాల అమలు, జీవో నెం.17 ద్వారా నిధులు వేరే ప్రభుత్వ అవసరాలకు మళ్లించకుండా నిరోధించడం, సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ నిధులను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. దారి మళ్లించిన నిధులను రికవరీ చేసి బోర్డు అకౌంట్‌లో జమ చేయాలన్నారు. సంక్షేమ బోర్డు సక్రమంగా పనిచేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆయా కమిటీల్లో కేంద్రస్థాయి కార్మిక సంఘాల సభ్యులను నియమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆలం శంకర్, నగిరి రామారావు, బండారు వెంకటేష్, మొల్లేటి ఈశ్వరరావు, తోట సత్తిబాబు, పెద్దిశెట్టి దుర్గ, వెదురుపర్తి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆరా

అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించిన బృందం



అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం వెల్‌నెస్ సెంటర్‌ను టాస్క్ ఫోర్స్ బృంద సభ్యులు శుక్రవారం సందర్శించారు. సెంటర్ పరిధిలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. మాతా శిశు ఆరోగ్య సేవలు, గర్భిణులు,బాలింతలు,పిల్లలకు అందుతున్న సేవలను పరిశీలించారు. జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి లూసీ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అక్కడ పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పి కుమారి,వైవీ తులసీ, ఏఎన్ఎం పరమేశ్వరీతో పాటు ఆశ వర్కర్లకు చెందిన రికార్డులను తనిఖీ చేశారు. ముఖ్యంగా వ్యాధి నిరోధక టీకాలు, వారి గృహ స్థాయిలో నియమానుసారం చేస్తున్న సందర్శనల రికార్డులు పరిశీలించారు. ప్రపంచ జనాభా దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. రికార్డుల నిర్వహణ,డేటా ఆన్‌లైన్ చేయడంలో లోపాలను గుర్తించి తగు సూచనలు చేశారు. జిల్లా అధికారులు,ప్రభుత్వానికి నివేదికలు సమర్పిస్తామని డాక్టర్ లూసీ తెలిపారు.జిల్లా టాస్క్ ఫోర్స్ బృందంలో వైద్య ఆరోగ్య శాఖ జిల్లా గణాంక అధికారి రామచంద్రరావు,ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి కె. జగదీష్, నానాజీ,మిగిలిన అధికారులు డి నాగమణి, వై. జనార్దన్,గుల్లేపల్లి ఆరోగ్య విస్తరణ అధికారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు గౌరవ వేతనాల చెల్లింపునకు అంగీకారం



వలంటీర్లతో ఎంపీపీ బోకం సూర్యకుమారి తదితరులు

సబ్బవరం: మండలంలోని గ్రామ సచివాలయ వలంటీర్లకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం చెల్లింపు అంశం శుక్రవారం కొలిక్కి వచ్చింది. ఎంపీపీ బోకం సూర్యకుమారి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తాజా చర్చలతో రెండు నెలల గౌరవ వేతనం చెల్లించేందుకు పంచాయతీ కార్యదర్శులు అంగీకరించారు.దీంతో మండలంలోని సుమారు 330 మంది వలంటీర్లకు రెండు నెలల గౌరవ వేతనం అందనుంది. వలంటీర్లు చర్చలు సఫలీకృతం చేసినందుకు ఎంపిపి బోకం సూర్యకుమారితో పాటు గౌరవ వేతనం చెల్లించేందుకు ముందుకు వచ్చిన పంచాయతీ కార్యదర్శులకు కృతజ్ఞతలు తెలిపారు.

శాకంబరి అలంకరణలో నల్లమారమ్మ



శాకంబరీదేవిగా నల్లమారమ్మ తల్లి

అనకాపల్లి: మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ రామాపురం కాలనీలో కొలువైన నల్లమారమ్మ తల్లిని ఆలయ కమిటీ సభ్యులు ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ దేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వృత్తి నైపుణ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కొణతాల

- జన శిక్షణ సంస్థాన్ శిక్షణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి: సాంకేతిక పరిజ్ఞానం సాయంతో వృత్తి నైపుణ్యత పెరిగితే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో జన శిక్షణ సంస్థాన్(జేఎస్ఎస్) సహకారంతో టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ శిక్షణ తరగతులను శుక్రవారం ప్రారంభించి, మాట్లాడారు. ప్రస్తుత స్పీడ్ యుగంలో వృత్తి నైపుణ్యతల్ని మెరుగుపరచుకుంటేనే జీవితాన్ని ఎదుర్కోగలమన్నారు. నిరంతర పఠనం, శిక్షణ మరింత విజ్ఞానాన్ని పెంపొందిస్తుందన్నారు. ఆధునిక సాంకేతికత వల్ల వ్యాపారాలు, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని, వాటిని అందిపుచ్చుకోవడంతో మోసాలకు గురవకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో డిజిటల్ అక్షరాస్యత ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. డిజిటల్ అక్షరాస్యత తక్కువగా ఉన్న మహిళలు, గ్రామీణులు తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సహించేందుకు టైలరింగ్, బ్యూటీషియన్, కంప్యూటర్ ఉచిత శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. జేఎస్ఎస్ చైర్మన్ సీపీ రామరాజు మాట్లాడుతూ రోజూ మూడు గంటలు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ కాలంలో స్టేషనరీ, మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణలో నైపుణ్యం సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. గౌరీ గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న గత బ్యాచ్‌కు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో జేఎస్ఎస్ డైరెక్టర్ కె.నాయుడు, గ్రంథాలయ అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కోశాధికారి భీశెట్టి కృష్ణఅప్పారావు, మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు కాండ్రేగుల సత్యనారాయణ, బొడ్డేడ జగ్గఅప్పారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నోట్ పుస్తకాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరావు

పరవాడ: ప్రభుత్వం సరఫరా చేసే నోట్ పుస్తకాలను ప్రతీ విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.నారాయణరావు కోరారు. కళాశాలలో చదువుతున్న 316 మంది విద్యార్థులకు ప్రభు త్వం సమకూర్చిన నోట్ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. త్వరలో విద్యార్థులకు బ్యాగు, పాఠ్య పుస్తకాలను అందజేయనున్నామని ప్రిన్సిపాల్ నారాయణరావు చెప్పారు.

రాయితీ ధరలకు బియ్యం, కందిపప్పు



వినియోగదారులకు రాయితీ ధరపై కందిపప్పు అందిస్తున్న కేవీఎల్ఎన్ మూర్తి

అనకాపల్లి: పెరిగిన నిత్యావసర సరకుల ధరల్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు మండలాల్లో ప్రత్యేక దుకాణాల ద్వారా రాయితీ ధరలకే అందించనున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కేవీఎల్ఎన్ మూర్తి తెలిపారు. నిక మెయిన్ రోడ్డులో శ్రీధరాల జోగారావు దుకాణం వద్ద బియ్యం, పప్పుదినుసుల విక్రయాలకు ప్రత్యేక స్టాల్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దుకాణంలో తక్కువ ధరలకు నిత్యావసర సరకులు విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు నాణ్యమైన కందిపప్పు కేజీ రూ.160, బియ్యం కిలో రూ.49కే విక్రయిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌వోలు కల్యాణి, నందకిశోర్, సీఎస్‌డీటీలు లీలాశేషుకుమారి, అనకాపల్లి రైస్, డాల్ మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శ్రీధరాల సోమరాజు, అధ్యక్షుడు బొడ్డేడ శంకరరావు, కార్యదర్శి గుండా సాయి, కోశాధికారి బచ్చు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లంఘనుడిపై చర్యలు ‘తీసుకోవాలి’



తాడి కొండపై నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు జరిపిన అక్రమార్కులు

పరవాడ: తాడి క్వారీలో నిబంధనలు అతిక్రమించి గ్రావెల్ తవ్వకాలకు పాల్పడిన అక్రమార్కులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ శీలం నదియా డిమాండ్ చేశారు. ఆమె శుక్రవారం సాక్షితో మాట్లాడారు. తాడి గ్రామంలో సర్వే నెం.116లో క్వారీలో గ్రావెల్ తవ్వకాలకు లీజు పొందిన వ్యక్తి ప్రభుత్వం నిర్దేశించిన హద్దులు దాటి ఇష్టానుసారంగా గ్రావెల్ తవ్వకాలు జరిపి రూ.కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడ్డాడని ఆరోపించారు. రాత్రివేళ గ్రావెల్ తవ్వకాలకు పాల్పడుతూ రూ.కోట్లాది రూపాయల అక్రమార్జనకు పాల్పడుతున్నాడని నదియా దుయ్యబట్టారు. తనకు అధికార పార్టీ అండదండలు ఉన్నాయని.. తనను ఎవరు ఏమీ చేయలేరని గ్రామస్తులపై బెదిరింపులకు దిగుతున్నాడని ఆరోపించారు. అధికార పార్టీని అడ్డంపెట్టుకొని అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ నదియా డిమాండ్ చేశారు.